ర్యాలు వున్నాయి. అంతటి మహోన్నత వ్యక్తి జీవితంలో ఆడంబరాలకు పోయింది లేదు. జీవితాంతం ఆయన నిరాడంబర జీవితాన్నే గడిపారు.

...యిందన్నది కూడా అంత వాస్తవం.

– కె. బలరామ్‌రెడ్డి

## ఈ వారం కథ

# నేల మొట్టింది

**కోరా**

నొల్లయిపోయాయి. పైరు బాగా వుంది. దుబ్బు చేసింది. చేలల్లో యెరువు చల్లి కలుపు తీస్తున్నారు. పని వత్తిడి బాగా వుంది.

రంగారావు కలుపు తీయటానికి కూలీలను పంపించాడు. అతనూ, గాలిగాతిరిగే మరి కొందరు దేముడి గుడి అరుగు మీద కూర్చొని పులి జూదం ఆడుతున్నారు. పొలాన్నుండి వస్తూ లచ్చుమయ్య వాళ్ళ వంక చూసి, మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

కలుపులయ్యాయి. కుర్రాళ్ళందరూ బోరపాక వేశారు. చుట్టూదళ్ళు కట్టారు. లోన రెండు చాపలేసి, పేకాట మొదలు పెట్టారు. జోరున వాన కురుస్తోంది. అమాస ముందు ముసురు. చేలల్లో కులిక లోతు నీళ్ళు నిలుస్తున్నాయి. లచ్చుమయ్య గొడుగేసుకుని పొలం వెళ్తూ రంగరావును రమ్మన్నాడు. అతను 'అడ్డాట' పాటలో వున్నాడు. "నువెళ్తున్నావుగా, పెదనాన్నా! నా చేనుకూడా చూసిరా" అన్నాడు. లచ్చుమయ్య మాటాడకుండా వెళ్ళిపోయాడు.

వానలు వెనుకపడ్డాయి. రెండో తడవ కొందరు ఎరువులు చల్లుకుంటున్నారు. రంగారావు కూలీలకు ఎరువులిచ్చి చల్లి రమ్మన్నాడు. పరిహద్దు చేలు కావటం వలన లచ్చుమయ్య అన్ని సంగతులు గమనిస్తూనే వున్నాడు. ఆయన పెదవి కదపలేదు.

వెన్నెల రోజులు దాటి పోయాయి. వరి పొట్ట వేసింది. పిగిలి కంకులు వచ్చాయి. గింజలు పాలు పోసుకుంటున్నాయి. గాలి నిండా కమ్మని వాసనలు నిండిపోయాయి. రైతులు చేలగట్ల వెంట తిరుగుతూ, నీళ్ళు చూసుకుంటున్నారు.

రంగారావు కూలీలను పురమాయించి పాయాలు తీయించాడు. విత్తనాలు నానబోయించి, రెండో పైరు చల్లించాడు. పల్లాల్లో పడ్డవి మురిగి పోయాయి. విత్తనం సరిగా అంటలేదు.

కోతలైనాయి. కుప్పలు వేశారు. నూర్పిళ్ళు ప్రారంభించారు. లచ్చుమయ్య కుప్ప ప్రక్కనే రంగారావు కుప్ప వేయించుకున్నాడు. మాసూలు మొదలెట్టాడు. రంగారావు ప్రొద్దుటే కాఫీ త్రాగి కుప్ప దగ్గరకు వెళ్ళాడు. లచ్చుమయ్య బండి మీద కూర్చొని, చుట్టతాగుతూ, వాళ్ళ పని చూస్తున్నాడు. రంగారావు వెళ్ళి ఆయన ప్రక్కనే కూర్చున్నాడు.

పోతపోశారు. బస్తాలకు పట్టారు. రంగారావుకు ఎకరానికి ఎనిమిది బస్తాలకన్నా మించి రాలలేదు. లచ్చుమయ్యకు ఎకరాకు ఇరవై అయిదు కాడికి పండాయి.

రంగారావుకు గుండె గుభేలుమంది. కనీసం పుట్టెడన్నా పండలేదు. భయపడుతూనే అడిగాడు "పెదనాన్నా! నువ్వేసిన పిండికన్నా నేనే ఎక్కువ వేశాను. నువ్వు పెట్టిన కూలీల కన్నా నేనే ఎక్కువ మందిని పెట్టాను. కాని, నా చేను నీ దిగుబడిలో మూడోవంతుపండలేదు" అన్నాడు.

లచ్చుమయ్య ముభావంగా "నిజమే! పండలేదు" అన్నాడు.

రంగారావు లోలోన లెక్కవేసుకున్నాడు. కూలి కూడా గిట్టదని తేలిపోయింది. వళ్ళు చెమటలు పట్టాయి. లచ్చుమయ్య వంక చూస్తూ, "ఎందుకని, పెదనాన్నా!" అన్నాడు లచ్చుమయ్య బస్సున లేచాడు.

"నన్నడుగుతావేరా? చేను నే అడుగు" అన్నాడు.

"చేనడగాలా?" రంగారావు ఆశ్చర్యంగా అన్నాడు.

"పంట యిచ్చేది చేనేగదరా? దాన్నే అడుగు".

రంగారావు లచ్చుమయ్య వంక చూశాడు. తన చేను వంక చూశాడు. పోతపోసి బస్తాలకెత్తిన ధాన్యం వంక చూశాడు. కాస్సేపాలోచించి" ఎందుకని పెదనాన్నా?" అన్నాడు.

లచ్చుమయ్య జావగారి పోయిన రంగారావు వంకచూసి, జాలిపడ్డాడు. కాని ఆయనకు చాలా కోపంగా వుంది. నెమ్మదిగా సమాధానం చెప్పాలనుకున్నా, ఆయన స్వరంలో కాఠిన్యత నిండివుంది. "అడ్డగుడ్డ కట్టి, పదమూడు ముక్కలూ పట్టుకుని, అడ్డు, షరతు, పై షరతూ అంటూ పాట పాడావు. చేను మీద ఆవగింజ శ్రద్ధ చూపలేదు. పని మీద దృష్టి లేదు. కూలీలను పంపితే, పని జరిగిపోతుందనుకున్నావు. నీకు సామెత తెలుసా? దున్నకేస్తే, కొయ్యక



పండిందని. ఇంకా వుంది. ఈ సంగతి గుర్తెట్టుకో వాలి నువ్వు నవ్వుతూ పలకరిస్తే, ఎదుటి వాడు నవ్వుతూ సమాధానం చెపుతాడు. నేల తల్లి కూడా అంతే. రోజూ రెండు పూటలా వచ్చి, చేను చుట్టూ తిరిగి, ఆజ కనుక్కుంటే దానికి సంతోషం. నీ శ్రద్ధకు అది మురిసిపోతుంది. కావలసినంత పంటనిస్తుంది. నువ్వు దాని ముఖం చూడలేదు. అందుకే నీ ముఖం అది చూడలేదు. సరిపోయిందా? అన్నాడు.

రంగారావు వింటూ కూర్చున్నాడు. లచ్చుమయ్య అప్పుడు పళ్ళు పట పట కొరికి, "గాడిద కొడకా! చేను చూద్దాం, రారా! అన్ని ఎన్ని తడవలు పిలిచాను? నువ్వు విన్నావా? ఇంట్లో పడుచు పెళ్ళాం వుంది. వీధిలో పేకాటుంది. సెంటరులో సినిమా హాలుంది. ఇప్పుడు మాత్రం ఏంలోటుంది?" అన్నాడు.

రంగారావుకు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. భయపడుతూ అన్నాడు. "తిట్టమాక, పెదనాన్నా" "నేను తిట్టటం దేనికిరా? నేల మొట్టిందిగా!" అని లచ్చుమయ్య లేచి వెళ్లాడు.

ఆ మరుసటి సంవత్సరం రంగారావు చేను వదల్లేదు. చేను మాత్రం వూరుకుంటుందా? ముప్పయి బస్తాల దిగుబడినిచ్చింది.

## మరికొన్ని జాగ్రత్తలు

ఇతరుల పట్ల గౌరవం, బాధ్యతాయుత ప్రవర్తన, కార్యదీక్ష తదితర అంశాలలో మీ పిల్లలకు శిక్షణ నివ్వండి. ఎవరైతే అన్ని విషయాలు అర్థం చేసుకుని నియమాలకు కట్టుబడి ఉండి (ఇది గౌరవంతో మెలగడం), ఎల్లప్పుడూ కృషి చేస్తూ ఉండి లేదా అపజయం ఎదురైనా కూడా మరింతగా పట్టు బిగిస్తారో (కార్యదీక్షత), తాము చేసిన పనుల పర్యవసానాన్ని ఎప్పుడు స్వీకరిస్తారో (బాధ్యతాయుత ప్రవర్తన) వారే మంచి నాయకులవుతారు.

మీ పిల్లలకు మీరు మార్గదర్శకుల్వాలనే మీ మాటలకంటే మీ చేతలే ముఖ్యం. స్వయంగా మీరే ఎప్పుడు ఇతరులను లేని పోని తప్పులతో దూషిస్తున్నప్పుడు మీ పిల్లలు ఎప్పుడు ఇతరులను గౌరవించరని గ్రహించాలి. మీరే పనులను ఎగవేస్తుంటే వారు కూడా బాధ్యతగా వ్యవహరిస్తారని ఆశించడం పొరపాటు.

అనేకమంది నాయకుల తల్లి తండ్రులు కూడా పరోక్షంగా నాయకత్వ లక్షణాలను చూపుతారని వెల్లడైంది. వారిపరిధి ఎప్పుడూ వారి గృహశ్రేయస్సులో అంతం కాలేదు. వారు సామాజిక కార్యక్రమాలలో కూడా పాల్గొనేవారు. కాబట్టి మీ పిల్లలను కేవలం ఇంటికి, చదువుకే కాకుండా ఇతర కార్యక్రమాలలో కూడా పాల్గొననివ్వండి. మీరు మీ పిల్లల పట్ల చూపే ప్రేమ, ఆసక్తి వారిలో విశ్వాసాన్ని, మనోబలాన్ని పెంచుతాయి. ఈ విధంగా కనుక మీరు పిల్లలతో వ్యవహరిస్తే మీ ఇంట రేపటి తరం నాయకులు పెరుగుతున్నట్లే.

– 'సిరి'